# కంగ్రాట్స్


## పెద్దింటి అశోక్‌కుమార్

"కంగ్రాట్స్" ఇంట్లోకి అడుగు పెట్టంగనే చెప్పింది శ్రీమతి. పేరు గూడా అదే. మొఖం సంతోషంతో వెలిగిపోతంది. స్వీటు ముక్కను నా నోట్లో పెట్టింది.

ఈ మధ్య ఎప్పుడో ఆమె నుంచి ఆ మాట వింటానని అనుకుంటనే ఉన్నాను. ఇప్పుడు విననే విన్నాను. నాకు సంతోషంగా లేదు. బాధగా లేదు. అలవాటుగా మాత్రమే ఉంది.

ఆమె కోసమే అన్నట్టుగా నవ్వుతూ చూసి "ఫోన్ వచ్చిందా" అన్నాను.

"ఆ... మధ్యాన్నమే... అన్న చేసిండు. వరంగల్‌లో వచ్చిందట" అన్నది శ్రీమతి.




నాకు సంతోషంగా లేదన్న విషయం అతి సంతోషంలో ఆమె గుర్తించలేదు. అసలు అట్లా ఊహించి కూడా ఉండదు. నేను టిఫిన్ బాక్స్‌ను, యూనిట్ టెస్ట్ పేపర్ల కట్టను టేబుల్ మీద ఉంచి నీరసంగా కూసున్నాను.

ఇంకోసారి కంగ్రాట్స్ చెప్పనని రెండేండ్ల కిందనే శ్రీమతి మాట ఇచ్చింది. అదే గుర్తు చేసుకున్నాను.

శ్రీమతి టీ తేవడానికి వంటింట్లోకి వెళ్లింది. నేను ఆలోచిస్తున్నాను. శ్రీమతి నిర్ణయమేమిటో నాకు ముందే తెలిసిపోయింది. నోట్లె నువ్వుగింజ నానది. ఒక నిర్ణయానికి రావడమే లేటు. బడబడ చెప్పుతనే ఉంటది. మనిషి ఎప్పుడూ సీరియస్‌గా ఉన్నట్టూ, ఆలోచిస్తున్నట్టూ కనిపించదు.

"ఇంకేం... చిన్నదాన్ని అక్కడే ఇంటర్‌లో వేద్దాం. ఇద్దరికీ హాస్టలంటే పెద్ద ఖర్చు. ఒక రూం తీసుకుని ముగ్గురం ఉంటం..." టీ కప్పు అందిస్తూ చెప్పింది శ్రీమతి.

"నేను వారంకొకసారి వరంగల్ తిరుగాలె" ఆమె మాటలను పూర్తి చేస్తూ అన్నాను. శ్రీమతి నవ్వి "కంగ్రాట్స్... రేపటి నుంచి మీరొక్కరే. ఇంతపెద్ద ఇల్లెందుకు. ఓ చిన్న రూం సరిపోతుంది" అన్నది. అంటూ తనే మళ్ళీ "...కంగ్రాట్స్ అని ఎందుకంటున్నానంటే రేపటి నుంచి ఏ మీటింగుకు పోయినా, ఎంత లేటయినా, తిన్నా, తినకున్నా తమరిని అడిగేవారుండరు" అన్నది.

**కం.**

నేను మాట్లాడకుండా టీ తాగుతూ కూసున్నాను. ఆమె నన్నే చూస్తుంది. నేను పై కప్పును చూస్తున్నాను. నాలోని మార్పును కొదిగా పసిగట్టినట్టుంది.

విచిత్రంగా చూసి "నేను నిజమే చెప్పుతున్న. అమ్మాయికి మెడిసిన్‌లో సీటచ్చింది. మనం ఎంతగా కలగన్నం. మన కలలను నిజం చేసింది. మీరు నా మాట నమ్ముతలేనట్టుంది" అన్నది.

"నమ్మక కాదే... నమ్మిన. నమ్మిన గాబట్టే ఈ బాధ" అందామనుకున్న. ఆమె సంతోషాన్ని కాదనలేక అనలేదు. ఆమె చెప్పినట్టు పెద్దదాన్ని డాక్టర్ చెయ్యాలని కలలుగన్నది నిజం. అవి నిజమైనది కూడా నిజం. ఈ జీవితాన్ని కోరుకున్నది నిజం. దీనివెంట పరుగెత్తుతున్నది నిజం.

అయినా తృప్తిలేదు. బాధలేదు. సంతోషం లేదు. టీ కప్పును కింద పెడుతూ ఆమె వైపు నవ్వుతూ చూసిన. ఇరువై ఏండ్లనుంచి నన్ను చదువుతుంది. నాలోని మార్పులను నాకంటే ఎక్కువగా ఆమెనే చెప్పగలదు. ఈసారి మాత్రం నా బేలతనాన్ని అర్థం చేసుకోలేకపోతుంది. చేతివేళ్ళతో నా తలను దూసింది. కండ్లలోనికి ఆపేక్షగా చూసింది.

"శ్రీ... ఇన్ని రోజులు నువ్వయినా నా వెంట ఉన్నావు. ఇప్పుడు నువ్వు గూడా దూరమైపోతున్నావు. నేను ఒంటరివాడినయ్యాను" అన్నాను. నా గొంతు మారింది.

శ్రీమతి విసుక్కుంది. ఈ కథ బాగనే ఉంది. పిల్లలకు సదువలద్దా... అయినా ఓ ఐదేండ్లు కష్టపడితే అయిపాయె. మస్కట్ పోతన్నమా, దుబాయి పోతన్నమా! సిరిసిల్లకు వరంగల్‌కు దండి దూరమా... వారం వారం రానే వడితివి" అన్నది.

అప్పటికే విషయం వాడంతా ఎలిసి పారినట్టుంది. ఒక్కొక్కలు వచ్చి కంగ్రాట్స్ చెబుతున్నారు. అదృష్టవంతులని పొగుడుతున్నారు. అందరికీ స్వీట్లు పంచుతుంది శ్రీమతి. వాళ్ళకు టిఫిన్ పెట్టడానికి అప్పటికప్పుడు ఏవో సరుకులు లిస్టు రాసి చేతిలో పెట్టింది.

బ్యాగ్ అందుకుని బయటకువచ్చిన. తొవ్వ పొంట నడుత్తుంటే తెలిసిన వాళ్ళందరూ కంగ్రాట్స్ చెబుతున్నారు. నిర్లిప్తంగా నడుస్తున్న నన్ను చూసి ఒకరిద్దరు నిజమా, కాదా అన్న సందిగ్ధంలో పడ్డట్టున్నారు. నా నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేదన్నది వాళ్ళ అనుమానం.

ఈ మధ్య 'కంగ్రాట్స్' అన్నమాట వింటేనే భయమయితుంది. చిన్నప్పుడు నేనూ మా దోస్తు 'జేబు చెగింక్' పెట్టుకునేవాళ్ళం. వాడు కనబడకుండా నా ముందుకు వచ్చి 'జేబు చెకింగ్' అనేవాడు. అన్నప్పుడల్లా జేబులో ఉన్న బలుపాలో, మామిడికాయలో, మక్కప్యాలాలో పోగొట్టుకునేవాన్ని. అప్పుడు ఆ మాట వింటేనే ఉల్కిపడేవాన్ని.

ఇప్పుడూ అంతే! కంగ్రాట్స్ అనే పదాన్ని వింటేనే భయం పుడుతుంది. విన్నప్పుడల్లా ఎవరో ఒకరిని కోల్పోతున్నాను. అది నన్ను వెంటాడుతుంది. వేటాడుతుంది.

నడుస్తుంటే సెల్ మోగింది. ఎత్తగానే 'కంగ్రాట్స్'. శివ్వరపుట్టింది. స్విచ్ ఆఫ్ చేసి జేబులో వేసుకున్నాను. వెనుకనుంచి ఎవలో 'సార్... కంగ్రాట్స్' అంటున్నారు. తిరిగి చూడలేదు. దుకాణం వరకూ తలెత్తలేదు.

లిస్ట్ చదివి సరుకులన్నీ మూట గట్టాడు సేటు. చుట్టూ ఎవలూ లేరు. కొద్దిగా ఊపిరి పీల్చుకున్నట్టయింది. కవరు పట్టుకుని బయటకు వస్తుంటే "ఔను గనీ యాదికి లేకపాయె. సార్... కం..." సేటు మాటలు. పూర్తి కాకముందే బయటపడ్డ. పాత సినిమాలో దయ్యం వెంట పడ్డట్టయింది నా పని. ఎటు పోతే అటు వద్దనుకున్నా ఆ మాటలు వినిపిస్తనే ఉన్నయి.

మొదటిసారిగా ఈ మాటలు శ్రీమతి నోటివెంటనే విన్న నాకు బాగా గుర్తు. అప్పుడు ఊర్లోనే ప్రైవేట్ టీచర్‌గా పనిచేసేవాన్ని. పొద్దున సాయంత్రం ట్యూషన్ చెప్పేవాన్ని. వాళ్ల ఫీజులు ఇయ్యక పోదురు. నేను అడుగకపోదును. ఏదో చెయ్యాలనే ఉత్సాహం, ఆరాటం ఉండేది. పిల్లలు వాళ్ళ తల్లిదండ్రులు దగ్గరగా ఉండేవాళ్ళు. పిల్లల గురించి వాళ్ళతో చర్చించేవాన్ని. మంచీ-చెడ్డా చెప్పుకునేవాళ్ళు.

ఏ.పి.రెసిడెన్షియల్‌కు, నవోదయకు, సైనిక్ స్కూల్‌కు పిల్లలతో అప్లై చేయించేవాన్ని. కోచింగ్ ఇచ్చేవాన్ని. అప్పు ఇచ్చినోళ్ళు, తీసుకున్నోళ్ళు,

ఇంకా వేరే పనిమీద వచ్చేటోళ్ళు ఎప్పుడూ ఎంట నలుగురుండే వాళ్ళు. సైకిల్ మీద బడికిపోతే ఎదురైన మనిషిల్లా ఆపి మాట్లాడు దురు.

ఆరోజు బడి నుంచి సాయంత్రం ఇంటికి వచ్చిన.

శ్రీమతి నవ్వుతూ 'కంగ్రాట్స్'అన్నది. అంటూ ఇంటర్వ్యూ కాల్ లెటర్ చేతిలో పెట్టింది. నోరు తీపి చేసింది. బతుకు చేదవడం మొదలయింద ని అప్పుడు తెలువది. ఇంటర్వ్యూ బాగానే చేసాను.


మరోనాడు పేపర్లో సెలెక్టెడ్ నెంబరు చూసి 'కంగ్రాట్స్' అన్నది తనే. ఆ మాటలు ఆమె నోటివెంట వింటుంటే ఎంతో కుషీగా ఉండేది. మళ్లీ మళ్లీ వినాలనిపించేది. ఎస్‌జీటీ ఉద్యోగం రావడం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊర్లో జాయిన్ గావడం వెంట వెంటనే జరిగి పోయాయి.

పొద్దున సైకిలందుకుని సద్ది గట్టుకుని పోతే సాయంత్రం ఇంటికి. బడిలో సార్లతో బాత్‌ఖానీ గొట్టి ఒక్కొక్కనాడు రాత్రికి. ఊర్లో తిరుగుడు తక్కువైంది. కష్టం, సుఖం తెలుసుకునుడు తక్కువైంది. ఒక్కొక్కనాడు మీటింగులుంటే రెండు మూడు రోజులు ఎవలకూ కనవడుడే లేదు. జనం ఇంటికి రావడం తగ్గింది. వచ్చిపోయేప్పుడు తొవ్వ పొంట మాత్రం కలుసుకుం టున్నాం.

ఒకనాడు ఆయాసంగా సైకిల్ మీద ఇంటికి రాగానే 'కంగ్రాట్స్' అంది శ్రీమతి. ఏమిటి, ఎందుకు అని అడుగకుండనే "ఇన్ని రోజులు ఆయాసపడుతూ సైకిల్ తొక్కుతుంటే చూడలేకపోయానండీ. మా నానతో పోరు పెట్టుకున్నాననుకో. ఇప్పుడు మీరు హోండా బండికి ఓనరయింౖడు" అన్నది బండివైపు నడిపిస్తూ.

కొత్త బ్లాక్ స్ప్లెండర్. నాకు ఇష్టమైన కలర్. బండిని చూస్తుంటే మనసు పొంగింది. అది నా కల. ఇప్పుడు నిజ మైంది. దానిని సంతోషంగా తాకుతుంటే శ్రీమతి నోరు తీపి చేసింది.

కొత్త స్ప్లెండర్ మీద బడికి వెళ్ళిన. ఊరు నన్ను కొత్తగా చూసింది. వచ్చేటప్పు డు, పోయేటప్పుడు సైకిల్ ఆపుడు మాట్లాడుడు నా అలవాటు. కొత్త మురిపానికి వారం ప దిరోజులు అ డుగడుగునా ఆపిన. రోజు రోజూ అది తగ్గి పోయింది. నన్ను చూస్తుంటే వాళ్ళ కండ్లల్లో ఏదో భయం మొదలయింది. నాకు విసుగు మొదలయింది.



ఇంటిముందు స్టాటయి తే బండి బడిముందే ఆగేది. ఊరు దాటేవరకు మాత్రం చెయ్యి ఎత్తేవాన్ని. తల ఊపేవా న్ని. గొల్లపెల్లి రోడు మీద దించుమని మాత్రం ఎవలో ఒకలు ఎక్కే వాళ్ళు. అర్జంటు పనంటూ ఒక్కొక్కరోజు ఇద్దరు, కొందరు రాత్రిపూట నే రిజర్వు చేసుకునే వాళ్ళు.

ఇద్దరు ఎక్కిన్నాడు నా మనసు గిలగిలా కొట్టుకునేది. దీనికి పులి స్టాప్ పెట్టాలని గట్టిగా నిర్ణయం తీసుకున్న. ఒకలు ఎక్కినంక ఎక్కడా ఆపడమే మానేసిన. మాట్లాడుడు తగ్గించిన. చెట్టు ఒక్కొక్క ఆకునూ రాల్చుకున్నట్టు ఒక్కొక్కరితో దోస్తు వదిలిపోయింది.

ఊర్లో ఉన్నా రెండేండ్లలో ఊరు దూరమయింది. నేను, బండీ, అమ్మా, బాపూ, తమ్ముడూ, శ్రీమతీ, పిల్లలూ మిగిలాం.

"పార్ట్ టైం జాబ్. ఆ కాలేజిలో అయితే సాలరీ ఎక్కువని నెల నెలా ఇస్తారని చెప్పారు చూడూ... ఆ సారు... ఫోన్ చేసిండు. ఈరోజు నుంచే ఈవినింగ్ క్లాసులకు రమ్మన్న డు... నెలకు రెండు వెయిలంటే మాటలా... ఖర్చు మొత్తం ఎల్లు తది. జీతం ఎనుకేసుడే" అంటూ నోరు తీపి చేసింది.
నాకు సంతోషంగా లేదు. అలాగని బాధగా లేదు. నిర్లిప్తంగా ఉంది. నీరసంగా కూర్చుంటే కాఫీ ఇచ్చి ఉషారు చేసింది.

ఉన్నట్టుండి మరోనాడు 'కంగ్రాట్స్' అంది శ్రీమతి. అంటూ ప్రమోష న్ ఆర్డర్‌ను నా చేతిలో పెట్టింది. ఎస్సేమ్యాస్‌గా కౌన్సెలింగ్ ఆర్డర్ అది. నోట్లో స్వీటు పెట్టింది. స్వీటు స్వీటుగా అనిపించలేదు. ఈసారి ఆమె మాట గూడా స్వీటుగా అనిపించలేదు.

మొదటిసారిగా 'కంగ్రాట్స్' అన్న పదం వెగటుగా అనిపించింది. నాలోని మార్పును గుర్తు పట్టినట్టుంది శ్రీమతి. "ఏంటీ... ఏదో విన గూడనిది విన్నట్టు రందికొద్ది ఉన్నారు. ప్రమోషనండీ బాబు... ప్రమోషన్. సిరిసిల్ల లో ఉందాం. పిల్లలు పెరుగుతుంౖడు గదా... ప్రైవేట్లో చదివించచ్చు... ప్రైవేట్లో టివీషన్లు చెప్పుకోవచ్చు..." అన్నది.

రెండు నెలల్లో సిరిసిల్లలోకి వచ్చిపడ్డాను. ఊర్లో అయితే పెద్ద ఇల్లు. ఇంటెనుక తోట. పిల్లలు ఎప్పుడూ తోటలోనే. ఇక్కడ ఇల్లు చిన్నదయింది. పెద్ద కుటుంబం నుంచి చిన్న కుటుంబం వేరయింది.

వారానికి ఒక్కనాడైనా ఇంటికి పోతున్నా ను. ఇప్పుడు చెయ్యి ఊపుడు కూడా తగ్గిం ది. కావాలని ఆగి పలకరించినా దూర దూరంగా, పొడిపొడిగా, భయం భయంగా మాట్లాడుతున్నారు. చనువుగా మాట్లాడితే 'గడ్డిగాళ్ళం గదా సారూ... మాకు మీకు యాడ దోస్తు' అంటున్నారు. మాట్లాడినా దాచి దాచి మాట్లాడుతున్నారు జనం. దగ్గరితనం తగ్గిపోయింది.

ఉన్నట్టుండి ఇంకోనాడు 'కంగ్రాట్స్' అన్నది శ్రీమతి.

"మల్లేం ముంచుకచ్చింది...?" విరక్తిగా అడిగాను.

ఈసారి కొద్దిగా ఊరించి చెప్పింది. "పార్ట్ టైం జాబ్. ఆ కాలేజిలో అయితే సాలరీ ఎక్కువని నెల నెలా ఇస్తారని చెప్పారు చూడూ... ఆ సారు... ఫోన్ చేసిండు. ఈరోజు నుంచే ఈవినింగ్ క్లాసులకు రమ్మ న్నడు... నెలకు రెండు వెయిలంటే మాటలా... ఖర్చు మొత్తం ఎల్లు తది. జీతం ఎనుకేసుడే" అంటూ నోరు తీపి చేసింది.

నాకు సంతోషంగా లేదు. అలాగని బాధగా లేదు. నిర్లిప్తం గా ఉంది. నీరసంగా కూర్చుంటే కాఫీ ఇచ్చి ఉషారు చేసింది. టైంను బాగాలుగా చేయడం, ఏ టైంలో ఎక్కడ ఉండటం... స్కూలుకు ఎన్ని నిమిషా ల్లో చేరటం ఎప్పుడు బయలు దేరటం... వారంలో అన్నీ అల వాటైపోయాయి.

ఊరికివెళ్లడం తగ్గింది. బడి లో బజార్లో బాత్‌కానీ తగ్గింది. ఫోన్ బిల్లు పెరిగింది. నాలో నేను కుంచించుకుపోతు న్నాను. నన్ను నేను వెన్ను తట్టుకుంటున్నాను. చెయ్యి తిరిగినశిల్పి విగ్రహాన్ని చెక్కిచెక్కి ఆకారం ఒక్కటే మిగిల్చినట్టు నేనూ, పిల్లలు, బండీ, శ్రీమతి, టీవీ, ఫోన్‌లు మాత్రమే మిగిలినాం.

అప్పుడు నాకు భయం పట్టుకుంది. ఎప్పుడు ఎవలను జార్చుకోవ లసి వస్తుందోనన్న భయం. బకాసురుని ఆకలికి ఒక్కొక్కలను పంపు తున్నట్టనిపించింది. కంగ్రాట్స్ అనే పదాన్నే వినగూడదనుకుంటున్న. నిజానికి ఆ పదాన్ని ఎవరితో అనుకూడదన్న కోపం గూడా వచ్చింది. స్కూల్లో పిల్లలు పుట్టిన రోజని చాక్‌లెట్లు ఇచ్చినా, కొలీగ్స్ శుభవార్తలు చెప్పినా వాళ్లకు కంగ్రాట్స్ చెప్పకుండా తప్పించుకున్న.

ఇంట్లో కూడా ఈ పదాన్ని నిశేదించాలనుకున్న. శ్రీమతికి చెప్పిన. నవ్వులాటగా తీసుకుని పిల్లలకు చెప్పింది. పిల్లలకు అదో ఆటయింది. డాడీ కంగ్రాట్స్ అనో, మమ్మీ కంగ్రాట్స్ అనో మేము యాష్టపడితే వాళ్ళిద్దరూ ఒకలకొకలు కంగ్రాట్స్ చెప్పుకునో ఆటపట్టించేవారు.

మొదట్లో కొంత ఎమోషన్‌కు గురైనా వాళ్ళను పట్టించుకోకపోవడమే

సరైన మార్గమనుకున్న. అయినా అప్పుడప్పుడూ ఇంట్లో ఆ మాట నే వింటున్నా.

రోజులెక్కనే ఒకనాడు ఇంటికి రాగానే శ్రీమతి నవ్వి "కోపం తెచ్చుకోకండి" అంటూ ఆగిపోయింది. నేను దేన్ని కోల్పోయానో తెలుసుకోకపోయినా, దేన్నో కోల్పోయినట్టుంటున్న విసయం మాత్రం తెలుసుకుంది. అందుకే అప్పు డప్పుడు అల్లరిగా కాకుండా అల్లరతో మాట్లా డుతుంది శ్రీమతి.

"ఎందుకు...?" అన్నాను భయం భయం గానే.

తను నవ్వును ఆపుకుంటూ తమాషగా "...కంగ్రాట్స్" అన్నది. అంటూ "పెద్దదా నికి... మీకు కూడా లక్ష రూపాయలు లాభ మంటే మామూలా..." అన్నది.


ఎప్పట్లాగే నీరసంగా కూసున్నాను. కాఫీ కప్పు అందిస్తూ పేపర్ ముందు పెట్టింది శ్రీమతి.

ఇపుడు రూంలో ఒక్కన్నే మిగిలాను. కురుక్షేత్ర యుద్ధ గుర్తు కచ్చింది. చివరికి మిగిలిన రారాజు గుర్తుకొచ్చిండు. గీతలోని శ్లోకం గుర్తుకచ్చింది. వారంతర్వాత బిగ్గరగా నాకు నేను "కంగ్రాట్స్" చెప్పుకున్నా. చివరగా నేనొక్కన్నే మిగిలాననుకున్నాను గదా! ఈవారంలో నేను గూడా మిగులలేదని తెలిసిపోయింది.

ఇంటర్ అడ్మిషన్‌కు నారాయణ కాలేజీవాళ్ళ టాలెంట్ టెస్ట్ ఫలి తాలు. వార్త రెండో పేజీలోనే ఉంది. సాహితి ఫస్ట్ ర్యాంక్. రెం డేండ్లు ఫ్రీ చదువు పోనూ ముప్పయి వెయిల మెరిట్ స్కాలర్ షిప్.

"ఇక్కడ కాలేజీలు బాగానే ఉన్నయి గదా... మనవద్దే చదివించు కుందాం" అన్న కప్పు కిందపెడుతూ. నేను నవ్వులాటకు అన్నాననుకుంది. తర్వాత నా మాటలకు నాకే నవ్వు వచ్చింది. రెండేండ్ల కోర్సుకు కనీసం అరువై డెబ్బయి వెయిలు. తనకే ముప్పయి వెయి లు ఇస్తామంటే వద్దనుడా...?

శ్రీమతి నా లోతును ఊహించలేదు. ఏదేదో చెప్పక పోతుంది. వారంలో సాహితి హాస్టల్ చేరిం ది. 'హోం సిక్, తల్లి సిక్, పిల్ల సిక్ నెల రెండు నెలల్లో అన్ని సికులు సర్దు కున్నయి. నా సిక్ ఒక్కటే మిగిలిపో యింది. ఆరోజు పెనుగాలిలో ఇంటి ముందున్న వేపచెట్టు కొమ్మ ఒకటి విరిగి పోయింది.



ఇల్లు ఇల్లులా లేదు. అల్లరి చాలా తగ్గింది. వెళ్తూ వెళ్తూ అది చూసిన చూపు నాకు ఇంకా గుర్తు. "అమ్మాయి షార్ప్. సింగిల్ అటెమ్ట్‌లో మెడిసిన్ గ్యారంటీ... ఊకే ఫోన్‌లని... ఇల్లని డిస్టర్బ్ చేయకండి" హెడ్ సూచనలాంటి హెచ్చరిక గుర్తుకొచ్చింది.

నెల తిరుగనే లేదు. "ఒకనాడు శ్రీమతి ఎదురొచ్చి "ఏంటోనండీ... ఎంత వద్దనుకున్నా మీకు చెప్పక తప్పడం లేదు..." అన్నది నవ్వుతూ.

ప్రతీదీ నా చేతులమీదుగానే జరుగుతుంది. అయినా నేను ఆమో దించడం లేదు. అలాగని విభేదిస్తున్నానా అంటే అదీ లేదు. నాకంటే శ్రీమతి నయం. ప్రతీదీ ఎంజాయ్ చేస్తుంది. గర్వంగా చెప్పుకుం టుంది.

"ఏమిటో....!" అన్నాను వెటకారంగా.

శ్రీమతి నవ్వును ఆపుకుంటూ "పిల్లలు కాదండి వీళ్ళు పిడుగులు. మీకు ఆ పదం చెప్పను గానీ సంగతి చెబుతాను. చిన్నది లేదూ... శృతి... గురుకులంలో సీటచ్చిందండి... ఇంగ్లీషు మీడియం" అంది.

అయింది... అంతా అయింది. అనుకున్నదంతా అయింది. ఇంత బతుకు బతికి ఇంటెనుక సచ్చినట్టు గొప్ప సమూహంతో ప్రయాణ మైన జీవితం ఎక్కడివరకచ్చింది? ఇది నేను కోరుకున్న జీవితమా? నన్ను తరుముతున్న జీవితమా?

చివరి ప్రయత్నంగా "చిన్నదాన్ని మనతోనే ఉండనియ్యే" అన్నాను. శ్రీమతి మంచి కార్యసాధకురాలు. నన్ను నొప్పించదు. తాను నొవ్వదు. మెప్పించి తీరుతుంది. "మీరు బలేవారండీ... అన్నీ తెలిసి నాచేత చెప్పి స్తరు. పిల్లల భవిష్యత్తు ముఖ్యం గదా... నాలుగేండ్లు ఓపిక పడితే మన దగ్గరికే వచ్చి రి. ఇక్కడ ఇంగ్లీష్ మీడియం అంతంత మాత్రమే..." అన్నది.

నెల రోజుల్లో ఇద్దరం మిగిలినం. మూడు రూముల ఇల్లు వద్దని రెండు రూముల ఇంట్లోకి మారినం. ఆరోజు రాత్రి. పట్టరాని సంతోషంతో "మనది సక్సెస్‌ఫుల్ లైఫ్ కదం డీ. అనుకున్నది అనుకున్నట్లు జరిగిపోతుం ది. ఇంకో పదేండ్లు కష్టపడితే పిల్లలు సెటిల్ అయితరు. తరువాత జీవితమంతా సుఖమే" అన్నది శ్రీమతి.

"పదేండ్ల తర్వాత జీవితమేముంటుందే... తింటే తిండి ఇమడది. పంటే నిద్ర పట్టదు. రోగాలు... నొప్పులు..." అన్న.

ఆమె అర్థం చేసుకోలేదు. మళ్ళీ ఈసారి కంగ్రాట్స్ చెప్పకుండా మాట మాత్రం తీసుకున్న. ఎందుకంటే ఈసారి కోల్పోయేది ఆమెనే. ఆమె ఆమె.గాదు. నా ఆత్మ గూడా.

ఇచ్చిన మాట తప్పి రెండేండ్ల తర్వాత శ్రీమతి మళ్ళీ కంగ్రాట్స్ చెప్పింది ఇప్పుడు.

"ఏమండీ.... ఇల్లు దాటేసిపోతున్నారు. ఏ లోకంలో ఉన్నారు. అంత సంతోషమైతే ఎట్లా...?" వరండాలోకి వచ్చి పిలుస్తూ దెప్పి పొడిచింది శ్రీమతి.

అప్పటికి గానీ సరుకులతో ఇల్లు చేరిన విష యం గుర్తించలేదు. చుట్టూ చూసి ఇంట్లోకి వస్తూ "ఏరీ మీ కంగ్రాట్స్ బలగం ఎవ్వలూ లేరేం" అన్న.

శ్రీమతి కోపంగా "మీరు దున్నంగ పోయి దలుపంగ వస్తిరి. గంటలకు గంటలు ఉంటరా... బజార్ల ఇంతసేపు ఎవలతో ముచ్చట వెట్టిండ్రు" అన్నది కవరును అందు కుంటూ.

అంత అదృష్టమా అనుకున్న.

ఆరోజు శ్రీమతి కొండయ రాగాలు తీస్తుంది. నేను దూరదూరంగా ఉంటే దగ్గరకు తీసుకుంది.

ఆమె మెడ వంపులో మొఖాన్ని దాచుకుంటూ "శ్రీ... నువ్వు నాకు ప్రియమైన శత్రువువి" అన్న.

"కాదండీ... మీ పరపతిని. ఎంజాయ్ మి" నవ్వుతూ అంది.

ఇద్దరు పిల్లల జాయినింగ్, వరంగల్‌లో రూం, నేను డబల్ నుంచి సింగిల్ రూంలోకి మారడం రెండుసార్లు అటీటు తిరగడం... నెలపట్టింది.

ఇప్పుడు రూంలో ఒక్కన్నే మిగిలాను. కురుక్షేత్ర యుద్ధ గుర్తు కచ్చింది. చివరికి మిగిలిన రారాజు గుర్తుకొచ్చిండు. గీతలోని శ్లోకం గుర్తుకచ్చింది.

వారంతర్వాత బిగ్గరగా నాకు నేను "కంగ్రాట్స్" చెప్పుకున్నా. చివ రగా నేనొక్కన్నే మిగిలాననుకున్నాను గదా! ఈవారంలో నేను గూడా మిగులలేదని తెలిసిపోయింది.

ఇప్పుడు నాకు కనీసం బూట్లు తుడుచుకోవడంగూడా చేతగాదు. ●